చికిత్స పొందుతూ యువకుడు మృతి

దండేపల్లి : మండలంలోని నెల్కివెంకటాపూర్ గ్రామానికి చెందిన బోడకుంట హరికృష్ణ(22) ఈ నెల 6న పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించి సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..హరికృష్ణ కొన్ని రోజులుగా ఎటువంటి పనీపాట లేకుండా తిరుగుతుండేవాడు. నాలుగు రోజుల క్రితం తల్లిదండ్రులు పనీపాట లేకుండా తిరిగితే పెళ్లి ఎలా అవుతుందని మందలించారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం పురుగులమందు తాగాడు. ఆ తర్వాత స్నేహితుడికి చెప్పడంతో ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. చికిత్స కొరకు లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కొరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం మృతి చెందాడు. తండ్రి శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



విద్యుత్ తీగలకు మూగజీవాలు బలి

వేమనపల్లి : విద్యుత్ తీగలకు తగిలి నాలుగు ఆవులు మృత్యువాత పడిన ఘటన మంగనపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. సోమవారం గ్రామ సమీపంలో ఆవులు మేస్తూ తెగి ఉన్న తీగలకు తగలడంతో గెడం రాములు దూడ, ఎనగంటి చిన్నన్న ఆవు, దూడ, అలం బక్కయ్యకు చెందిన ఆవు మొత్తం నాలుగు మూగజీవులు బలయ్యాయి. ఒక్కొక్క ఆవుకు సుమారుగా 10వేల వరకు ఉంటుందని, తమని ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే మూగజీవాలు బలయ్యాయని పేర్కొన్నారు. వర్షాకాలం ముందు వేలాడుతున్న విద్యుత్ తీగలను గమనించి సరిచేయకుండా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు.



సీఎం ఆదేశం..సాగుకు యోగం..!

- ఉమ్మడి జిల్లాలోని నాలుగు ప్రాజెక్టుల ప్రస్తావన
- పెండింగ్ పనుల పూర్తికి ప్రభుత్వం భరోసా
- అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశాలు
- సస్యశ్యామలం కానున్న సమీప పంట పొలాలు

ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా మిగిలిన ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టిసారించింది. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించినా.. చిన్న పాటి పనులు, మరమ్మతుల లేమి కారణంగా సాగుకు ఉపయోగపడటం లేదు. ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ పనులను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. తక్కువ ఖర్చుతో త్వరగా పూర్తయ్యే ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిసారించారు. నీటిపారుదలశాఖ అధికారులతో ఆయా ప్రాజెక్టుల పరిస్థితిపై ప్రస్తావించారు. సీఎం ఆరు ప్రాజెక్టులను పూర్తి చేయాలని సూచించగా.. ఇందులో నాలుగు ప్రాజెక్టులు ఉమ్మడి జిల్లాకు చెందినవి కావడం గమనార్హం. సీఎం ఆదేశాలతో మత్తడివాగు, నీల్వాయి, సదర్మాట్, పిప్రి ప్రాజెక్టుల పూర్తికి మోక్షం లభించనుంది. అంచనాలు సిద్ధం చేయాలని సూచించడంతో నిధుల విడుదలకు మార్గం సుగుమం కానుంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టిసారిస్తోంది. జిల్లాలో అనేక సాగునీటి ప్రాజెక్టులు ఉండగా వీటిలో కొన్నింటిని సత్వరం పూర్తిచేయాలని సర్కారు యోచిస్తోంది. ఇప్పటికే ప్రాణహిత, కుప్టి ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతామని సీఎం హామీనివ్వగా.. కడెంకు మరమ్మతులు చేపడుతామని భరోసా ఇచ్చారు. ఈ ప్రాజెక్టులు కాకుండా తాజాగా తక్కువ ఖర్చుతో త్వరగా పూర్తయ్యే ప్రాజెక్టులపై తొలుత దృష్టిసారించాలని సీఎం ఆదేశాలు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఆరు ప్రాజెక్టులను పరిగణనలోకి తీసుకోగా.. ఇందులో నాలుగు ఉమ్మడి జిల్లాకు చెందినవి ఉన్నాయి. ఈ ప్రాజెక్టులకు నిధులు విడుదల చేస్తే మిగిలిన పనులను పూర్తిచేసేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. తద్వారా మరికొన్ని వేల ఎకరాలకు సాగునీరందించేందుకు అవకాశం ఉంటుంది. చిన్నపాటి పనులు, మరమ్మతుల కారణంగా అపరిష్కృతంగా ఉండిపోయిన ప్రాజెక్టులు, పలు బ్యారేజీలకు తాజా ప్రభుత్వ నిర్ణయం జీవం పోసినట్లయింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి నీటిపారుదలశాఖ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా.. పరిశీలించిన ముఖ్యమంత్రి వాటికి ఆమోదముద్ర వేసినట్లు తెలిసింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల పెండింగ్ పనులకు మోక్షం కలగనుంది. మరోపక్క వీటితో పాటు చనక-కోర్ట బ్యారేజీ నిర్మాణ పనులతో పాటు కాల్వల నిర్మాణం కూడా పూర్తయింది. కానీ డిస్ట్రిబ్యూటరీ కాల్వల కోసం భూసేకరణ చేపట్టేందుకు నిధులు అవసరమవుతాయి. కుమురంభీం, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టులదీ ఇదే పరిస్థితి ఉంది. వీటిపైనా ప్రభుత్వం దృష్టిసారిస్తే అభివృద్ధిలో వెనుకబడిన ఉమ్మడి జిల్లాలో మరిన్ని ఎకరాలు సాగులోకి వచ్చేందుకు ఆస్కారం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


మత్తడివాగు ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన పంప్ హౌజ్

సీఎం ప్రకటనతో ప్రాజెక్టులకు మోక్షం

ఆదిలాబాద్ జిల్లాలోని వడ్డాడి గ్రామం వద్ద నిర్మించిన మత్తడివాగు ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా 25,500 ఎకరాలకు సాగునీరందిస్తున్నారు. కుడికాల్వ ద్వారా సాగునీరందించాలంటే కాల్వల నిర్మాణం కోసం భూ సేకరణ సమస్యగా మారింది. దీంతో అధికారులు మైక్రో ఇరిగేషన్ స్కీం పేరిట భూగర్భ పైప్‌లైన్ ద్వారా నీరందించాలని భావించారు. ఇందుకు రూ.7కోట్ల వ్యయం అవుతుండగా ఇప్పటి వరకు రూ.3కోట్లతో ప్రాజెక్టు సమీపంలో పంప్‌హౌస్ నిర్మించి పైప్‌లైన్లు వేశారు. ఆ ప్రాజెక్టు నుంచి కుడి కాల్వ ద్వారా పొన్నారి గ్రామ సమీపం వరకు పైప్‌లైన్లు వేసేందుకు ప్రతిపాదనలు పంపించారు. వీటితో పాటు విద్యుద్దీకరణ పనులు, ఆటోమెటిక్ వాల్స్, అవుట్‌లైట్స్ తదితర చిన్నపాటి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందుకు రూ.4కోట్ల వరకు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా.. తాజాగా సీఎం ప్రకటనతో ఈ నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. దీంతో ఈ ప్రాజెక్టు ద్వారా మరో 1200 ఎకరాలకు సాగునీరందించేందుకు ఆస్కారం ఏర్పడింది.

నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పిప్రి గ్రామం వద్ద 2021లో రూ.58.95కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఈ పథకం ద్వారా సమీపంలోని మోడం, గొడిసిర్యాల, లోకేశ్వరం, రాయిపూర్ కాంట్లీ గ్రామాల పంట భూములకు సాగునీరందించాలని భావిస్తున్నారు. కానీ పిప్రి పంట పొలాలకే తొలుత పైప్‌లైన్ సౌకర్యం లేకపోవడంతో ఆ గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేసి పనులు నిలుపుదల చేశారు. తాజాగా అదనపు పైప్‌లైన్ల నిర్మాణం కోసం అధికారులు 2023లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. తాజాగా సీఎం ఈ ప్రాజెక్టు ప్రస్తావన తీసుకురావడంతో త్వరలోనే నిదులు విడుదలై పనులు చేపట్టేందుకు మార్గం సుగుమం కానుందని తెలుస్తోంది. దీంతో ఆయా గ్రామాలకు చెందిన పంటలు సస్యశ్యామలం కానున్నాయి.



నిర్మల్ జిల్లా ఖానాపూర్ సమీపంలో గోదావరి నదిపై నిర్మిస్తున్న సదర్మాట్ బ్యారేజీ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ప్రస్తుతం ఈ బ్యారేజీ ద్వారా 15వేల ఎకరాలకు సాగునీరందిస్తుండగా.. గేట్లు బిగించి చిన్న పాటి పనులు చేపడితే అదనంగా మరో 5వేల ఎకరాలకు సాగునీరందించే అవకాశం ఉంటుంది. తాజాగా సీఎం సమీక్షలో ఈ ప్రాజెక్టు ప్రస్తావన రావడంతో ప్రభుత్వం ఇందుకు నిధులు విడుదల చేయనుందని తెలుస్తోంది. మరోపక్క మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలోని నీల్వాయి ప్రాజెక్టుకు అదనంగా ప్రభుత్వం నిధులు విడదల చేయనుందని తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుపైనా ప్రభుత్వం స్పందించడంతో నిధులు అందజేస్తే చుట్టుపక్కల పంట పొలాలకు సాగునీరందించేందుకు ఆస్కారం ఉంటుంది.



కలుషిత ఆహారంతో 15 మంది విద్యార్థులకు అస్వస్థత



నవతెలంగాణ-భైంసా

మండలంలోని దేగాం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం కలుషితం కావడంతో తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురై భైంసా ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం ఈ ఘటన జరగగా ఆలస్యంగా వెలుగు చూసింది. వారం రోజులుగా చిన్నారులకు వాంతులు, విరేచనాలు కావడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. చిన్నారులు అస్వస్థతకు గురైనప్పటికీ విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అస్వస్థతకు గురైన వారిలో రాందాస్, గణేష్, శివ, అశ్విత, షేక్ ఇమ్రాన్, అజీజ్, వినయ్ తదితర విద్యార్థులు ఉన్నారు. చిన్నారుల ఆరోగ్య విషయమై ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆరా తీశారు. తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని ఏరియా హాస్పిటల్ డాక్టర్లను ఆదేశించారు.

అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలపై చర్య తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న మెడికల్ కళాశాల అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ సోమవారం ప్రజాఫిర్యాదుల విభాగంలో ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ వైద్య కళాశాలలో ఉద్యోగాల భర్తీ కోసం రెండు పత్రికల్లో వేరువేరు ప్రకటనలు ఇచ్చారన్నారు. ఖాళీగా ఉన్న 73 అవుట్ సోర్సింగ్ పోస్టులను భర్తీ చేయడానికి శ్రీ మహాలక్ష్మి మ్యాన్ పవర్ అండ్ ప్లేస్ మెంట్ సర్వీసెస్, ప్రణయన్ హౌస్ కీపింగ్ సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీలు మార్చి 15న ప్రముఖ తెలుగు పత్రికలో ప్రకటన ఇచ్చారని, దీనికి జిల్లాలోని సుమారు 6000 మంది వరకు నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. 4 నెలలు గడిచినా ఏజెన్సీల నిర్వాహకులు మాత్రం పోస్టులు భర్తీ చేయలేదని, అంతే కాకుండా ఈ పత్రిక ప్రకటన రద్దు చేయకుండానే మళ్లీ జూన్ 13న మరో పత్రికలో ప్రకటన ఇచ్చారని తెలిపారు. రెండు ప్రకటనలు ఇచ్చి నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇలా చేయడం ద్వారా ఈ పోస్టుల భర్తీలో అవకతవకలు జరుగుతున్నట్లు అనుమానం ఉన్నందున రెండు ప్రకటనలు ఇచ్చిన దానిపై కలెక్టర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి స్పందించి విచారణ చేపట్టి ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుంటాల కుమార్, వెంకటేష్, పోశం పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయునికి సన్మానం



నవతెలంగాణ-బేల

మండలంలోని కొత్త సాంగిడి ప్రాథమిక పాఠశాలలో 12 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా పని చేసి ఇటీవల గిమ్మ ప్రభుత్వ పాఠశాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు ఆత్రమ శ్రీకాంత్ దంపతులను గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు సన్మానించి ఆప్యాయత చూపడంతో ఉపాధ్యాయుడు భావోద్వేగానికి గురయ్యాడు. తాను ఉపాధ్యాయుడిగా ఎంపికై మొదటి పోస్టింగ్ సాంగిడిలోనే పొందానని, 12 సంవత్సరాల ఉద్యోగ జీవితం తాను జీవితంలో ఎప్పటికీ మర్చిపోనని తెలిపాడు. గ్రామస్తుల ఆప్యాయత ఎప్పటికీ మర్చిపోలేనని పేర్కొన్నాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్ నార్లావార్, వీడీసీ సభ్యులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండల వాసికి 'ఉద్యమ గాన కోకిల' పురస్కారం

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని నెల్కివెంకటాపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ సాంస్కృతి సారథి బృంద సభ్యుడు ముల్కల మురళి 'ఉద్యమ గాన కోకిల' పురస్కారానికి ఎంపికయ్యాడు. తెలంగాణ ఉద్యమంలో తమ గానంతో ప్రజలను చైతన్య పరిచి కీలక పాత్ర పోషించిన ఉద్యమ గాయకులకు 'తెలంగాణ పీపుల్స్ మూమెంట్' సంస్థ ఆధ్వర్యంలో పురస్కారాలు ప్రకటించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ముల్కల మురళి అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డు సమస్య పరిష్కారం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో నిర్మల్-స్వర్ణ రోడ్డుపై గుంతలు ఏర్పడి నిలిచి నీరుతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇటీవలే ఈ రోడ్డుపై ప్రయాణించిన బీజేఎల్పీ నాయకుడు, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి రోడ్డు పరిస్థితిని గమనించి వెంటనే అధికారులకు రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో సోమవారం రోడ్డు పనులు ప్రారంభించారు. గ్రామస్తులు, వాహనదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావాణి అర్జీలపై నిర్లక్ష్యం చేయొద్దు : కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలు ఇచ్చే అర్జీలపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వాటిని త్వరతగతిన పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. 156 అర్జీలను పరిశీలించి పరిష్కరించేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఇందులో వికలాంగుల పెన్షన్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, సదరం సర్టిఫికెట్, రహదారుల ఏర్పాటు, బీసీ రెసిడెన్షియల్ స్కూల్ అడ్మిషన్, గాదిగూడలో మీ సేవ మంజూరు కొరకు తదితర దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. వారి పరిధిలోని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని సూచించారు. ప్రజాపాలన కేంద్రాలను పరిశీలించాలని, ప్రత్యేక అధికారులుగా నియమించబడిన అధికారులు వారికి కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. డ్రై డే డ్రై డేపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


వికలాంగులకు వీల్‌చైర్స్ అందజేస్తున్న కలెక్టర్

వికలాంగులకు వీల్‌చైర్స్ అందజేత

ఇంద్రవెల్లి మండలం ముత్నూరు గ్రామానికి చెందిన వికలాంగుడు వివేక్, గాదిగూడ మండలం బొజ్జుగూడ గ్రామనికి చెందిన సంభాజీలకు వీల్‌చైర్స్ అందజేశారు. వీరు ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షి షాను కలిసి వీల్‌చైర్స్ అందజేయాలని కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్ కొన్ని నిమిషాల్లోనే పరిష్కారం చూపడంతో అందరు ఆశ్చర్యానికి గురయ్యారు.

గ్రామంలో బెల్టు షాపులు ఎత్తేయాలి

గ్రామంలో బెల్టుషాపులు ఎత్తివేయాలని బేల మండలం మాంగ్రూడ్ గ్రామ మహిళలు ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో విచ్చలవిడిగా బెల్టుషాపులు ఉండడంతో 15 సంవత్సరాల బాలల మద్యానికి అలవాటు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్, ఎక్సైజ్ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని కోరారు.


కలెక్టరేట్‌కొచ్చిన మాంగ్రూడ్ గ్రామస్తులు

వీక్లీ ఆఫ్‌లు అమలు చేయాలి

కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లకు వీక్లీ ఆఫ్‌లు అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్టీయూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి దుర్గం కళావతి ఆధ్వర్యంలో ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించారు. వీక్లీ ఆఫ్ ఇవ్వాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ విద్యాశాఖ అధికారులు అమలు చేయడం లేదన్నారు. అత్యవసర సమయంలో పాఠశాలకు హాజరు కాకపోతే ఆబ్సెంట్ వేసి వేతనాలు కట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్కర్లకు వారాంతపు సెలవులు అమలయ్యే విధంగా విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సునిత, జిల్లా నాయకులు గీత, శ్రీవెజ, మనోజ, మల్లయ్య పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ-నస్పూర్

బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి, ఎస్కే బాజీ సైదా హాజరై దీక్షలో కూర్చునే కార్మికులకు పూలమాలలు వేసి దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో వెలువడే బొగ్గు నిక్షేపాలను ప్రభుత్వ రంగసంస్థ అయిన సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు గనులను వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ఎదుట 8 నుండి 13 వరకు దీక్షలు చేవడుతున్నామన్నారు. తెలంగాణ బిడ్డ అయిన కిషన్‌రెడ్డి బొగ్గు గనుల శాఖామంత్రిగా ఉన్నందున గతంలో ఒడిస్సా, గుజరాత్, చత్తీశ్‌ఘడ్ లాంటి ప్రాంతాల్లో అక్కడి ప్రభుత్వ రంగ సంస్థలైన వాటికే నామినేషన్ పద్ధతిలో బొగ్గు గనులను ఇచ్చారని, అదే తరహాలో తెలంగాణలోని గనులను నామినేషన్ పద్ధతిలో ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్‌రావు, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, మిర్యాల రాజేశ్వరరావు, బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, సంపత్, మారుపెల్లి బాబు, కారుకూరి నగేష్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి, మొగిలి లక్ష్మణ్, ఫిట్ కార్యదర్శులు దాడి రాజయ్య, సదానందం, సత్యనారాయణ, కామెర వేణు, అనంతరెడ్డి, యాదగిరి, రాఘవ రాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.



గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మెన్‌గా కోట్నాక తిరుపతి

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



తెలంగాణ రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్‌గా కోట్నాక తిరుపతి నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన ఈయన తొలి నుంచి కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈయన కిందటేడాది ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్రలోనూ జిల్లా నుంచి పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. ప్రస్తుతం ఆదివాసీసేన మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్‌గా ఆదివాసీ విభాగం మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌ఛార్జిగానూ వ్యవహరిస్తున్నారు. నిబద్ధతతో పార్టీకి ఈయన అందించిన సేవలను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రస్థాయి పదవి కట్టబెట్టింది. రాష్ట్రంలోని గిరిజనుల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతానని, వారికి ఏ చిన్నపాటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు శాయశక్తులా కృషిచేస్తానని తిరుపతి తెలిపారు. తన పరిధిలోని శాఖను కట్టబెట్టినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక చేయూత



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని విద్యానగర్‌లో నివాసముంటున్న లకుమల్ల నవీన్‌కు ఆత్మీయ ఛారిటబుల్ ట్రస్ట్ రూ.10వేలు అందించింది. నవీన్ అమ్మానాన్న చనిపోవడంతో అమ్మమ్మతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతను పుట్టుకతోనే వికలాంగుడు. చిన్నతనంలో పోలియో వచ్చి ఎడమ కన్ను, ఎడమ చేయి, ఎడమ కాలు దెబ్బతిన్నాయి. ఇల్లు పూర్తిగా శిథిలావస్థలో ఉండటంతో దాత సాయంతో చిన్న రూము కట్టుకున్నారు. ఇంటి ఎదుట రేకులు వేసుకోవడానికి ఆర్థిక స్థోమత లేదని ఆత్మీయ ఛారిటబుల్ ట్రస్టును ఆశ్రయించగా ఆ సంస్థ వెంటనే స్పందించి రూ.10వేల ఆర్థిక సాయం అందించింది. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు లక్ష్మణ్ మాట్లాడుతూ ఇంకా ఎవరైన దాతలుంటే పెద్ద మనసుతో సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు భూమేష్, కోశాధికారి సురేష్, సభ్యులు సుభాష్, మల్లేష్, రమేష్, కె.సంపత్, మహేందర్, బి.సంపత్, కొండ కుమార్ పాల్గొన్నారు.

పాము కాటుతో యువ రైతు మృతి

నవతెలంగాణ-ఇచ్చోడ



పాముకాటుతో యువ రైతు మృతి చెందిన ఘటన మండలంలోని దాబా(కె) గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... దాబా(కె) గ్రామానికి చెందిన రైతు జాదవ్ లక్ష్మణ్(28) రోజు లాగానే ఆదివారం ఉదయం చేనులోకి వెళ్లాడు. పత్తి పంట చేనులో ముళ్ల కొమ్మలు తొలిగిస్తుండగా ఎడమ కాలుకు ఏదో కుట్టినట్లు అనుమానం కలుగుతోందని వెంటనే ఇంటికి వచ్చాడు. నొప్పి ఏమి లేకపోయేసరికి మళ్లీ చేనుకు వెల్లుతుండగా మార్గ మధ్యలోనే స్పృహ తప్పి పడిపోయాడు. అటు వైపు వెళుతున్న గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే ద్విచక్ర వాహనంపై ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి రెండు సంవత్సరాల క్రితమే పెండ్లి కాగా, భార్య, 5నెలల కుమారుడు ఉన్నాడు.

ఎన్ఐటీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా అమలవుతున్న సీడబ్ల్యూఎఫ్ స్కీమ్ ద్వారా ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ విద్యార్థులు కలెక్టర్ రాజర్షిషా ల్యాప్ టాప్‌లను అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో విద్యను అభ్యసిస్తున్న ఆర్తి, రాజకుమార్‌లకు పంపిణీ చేశారు. ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఐఐటీ, ఎన్ఐటీ ట్రిపుల్ ఐటీ, ఇతర ఉన్నత విద్యాలయాల్లో విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులు ఎవరైనా ఉంటే జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన మెస్రం కృష్ణ(18) తల్లిదండ్రులు సెల్‌ఫోన్ కొనివ్వలేదని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కృష్ణ తండ్రి నాగారావును నెల రోజులుగా సెల్‌ఫోన్ కొనివ్వాలని అడుగుతుండగా తండ్రి ఆర్థిక పరిస్థితి బాగా లేదని చెబుతున్నాడు. ఈ నెల 3న ఇంటి నుండి బయటకు వెళ్లి గ్రామ సమీపానగల బేతాల్ దేవుడి గుట్ట వద్ద ఉరేసుకున్నాడు. సోమవారం గ్రామానికి చెందిన వ్యక్తులు కాలకృత్యాలకు వెళ్లగా చెట్టుకు వేలాడుతున్న విషయం గ్రామస్తులకు చెప్పగా వెంటనే మృతుడి అన్న చంద్రశేఖర్ వెళ్లి చూసి తమ్మునిగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై సురేందర్ తెలిపారు. మృతదేహం కుళ్లిపోవడంతో సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-నేరడిగొండ

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని లఖంపూర్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. లఖంపూర్ 44వ జాతీయ రహదారి గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మృతదేహం తల నుజ్జునుజ్జ కావడంతో మృతుడు ఎవరు అన్నది గుర్తించలేకపోయాం. మృతి చెందిన వ్యక్తిపై నీలిరంగు జీన్స్ పాయింట్, నలుపు రంగు షర్ట్, కుడి చేతిపై అమ్మా అని పచ్చబొట్టు, ఎడమచేతి మనికట్టుపై చిన్న పుట్టుమచ్చ, ఉన్నట్టు, ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని బోథ్ మార్చురీలో భద్రపరిచినట్టు తెలిపారు. ఎవరైనా ఆనవాళ్లను బట్టి గుర్తించినట్లయితే వివరాలు తెలిసినచో 8712659947 ఎస్సైని సంప్రదించాలని తెలిపారు.

రీవాల్యుయేషన్‌తో టెన్త్‌లో 10జీపీఏ

నవతెలంగాణ-కడెం

మండలంలోని జెడ్‌పిహెచ్‌ఎస్‌లో పదవ తరగతి చదివిన జునైరా హిమాయత్ పేపర్ రీవాల్యుయేషన్‌తో 10 జీపీఏ సాధించింది. అన్ని సబ్జెక్ట్‌లలో మంచి మార్కులు రాగా హిందీలో తక్కువ మార్కులు వచ్చాయి. దీంతో ఆ సబ్జెక్టు రీవాల్యుయేషన్ చేయించింది. 10 జీపీఏ సాధించిన విద్యార్థినిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

తరగతి గదిలోకి వర్షంనీరు రాకుండా చూడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పాఠశాలలో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని, తరగతి గదులలో వర్షం నీరు రాకుండా చూడాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం పట్టణంలో బెల్లూరు, కోలిపుర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వన మహోత్సవంలో భాగంగా పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనుల తీరును, విద్యార్థుల ఏకరూప దుస్తులపై ఆరా తీశారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ టెక్ట్స్ బుక్‌లోని పాఠాలను చదివించారు. అలాగే వివిధ సమస్యలను కాలనీ వాసులు కలెక్టర్‌కు విన్నవించగా, సమస్యలపై పూర్తి వివరాలు సేకరించి రిపోర్టు అందజేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈఓ ప్రణీత, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ప్రిన్సిపల్స్ నారాయణ, జయశీల ఉన్నారు.

మండలంలో భారీ వర్షం

- ఇంట్లోకి ప్రవేశించిన వర్షపు నీరు

నవతెలంగాణ-నార్నూర్

మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. కురిసిన భారీ వర్షంతో మండలంలోని ఖంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చిత్తగూడ గ్రామానికి చెందిన మడావి గోవింద్‌రావ్ ఇంట్లో నీరు ప్రవేశించింది. వాగు రావడంతో వ్యవసాయ పొలానికి వెళ్లిన రైతులు గ్రామస్తులు రావడానికి ఇబ్బందులు పడ్డారు. బాధితుల ఇండ్లను దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు జాదవ్ శేఖర్ పరిశీలించారు. మడావి గోవింద్‌రావ్‌కు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వారి వెంట గ్రామపటేల్ మడావి బాదిరావ్, గ్రామ యువకులు ఉన్నారు.

కొనసాగుతున్న ర్యాపిడ్ ఫీవర్ సర్వే

నవతెలంగాణ-నార్నూర్

వర్షకాలం నేపథ్యంలో గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే కొనసాగుతోంది. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఎంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొలంగూడా, లంబాడి తండాతో పాటు ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి గర్భిణులకు, బాలింతలకు మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్‌దాస్, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ జవహర్‌లాల్, ఆశాలు రాథోడ్ వందన, లేతూబాయి ఉన్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-సిరికొండ

వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రతలు పాటించాలని ఆర్టీసీ డిపో సెఫ్టీ వార్డెన్ విష్ణు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జిల్లా ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన ఆదేశాల మేరకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వాహనదారులు వాహనాలను నడిపేటప్పుడు సెల్ ఫోన్లను వాడొద్దని అన్నారు. మండల కేంద్రానికి ఇచ్చోడ నుంచి ట్రిప్పులను పెంచే విధంగా జిల్లా డిపో మేనేజర్‌కు విన్నవించి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో కంట్రోలర్ ప్రేమ్‌సింగ్ పాల్గొన్నారు.

నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండల కేంద్రంలో తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి పెందోర్ సంతోష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ వారం రోజులుగా గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేని పక్షంలో ఎంపీడీఓ, ఐటీడీఏ కార్యాలయం ముట్టడిస్తామని అన్నారు. వారి వెంట నాయకులు కనక ప్రభాకర్, పెందుర్ మధు, కోరేంగా శంభు, కొడప లింగు, మెస్రం గోవింద్, శంకర్, విలాస్. మంతు, మాణిక్ ఉన్నారు.

ప్రతిభను చాటేందుకు ఇంటింటా ఇన్నోవేషన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఔత్సాహికులు ఆవిష్కరణలో తమ ప్రతిభను చాటుకునేందుకు ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశంలో ఇంటింటా ఇన్నోవేషన్‌పై సమీక్షించారు. జిల్లా కోఆర్డినేటర్ సాయికృష్ణ రాష్ట్రవ్యాప్తంగా రైతులు, విద్యార్థులు తయారు చేసిన పలు ప్రదర్శనలను పవర్ పాయింట్ ప్రొజెక్టర్ ద్వారా తెలియజేశారు. అనంతరం ఇంటింటా ఇన్నోవేషన్ అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పాటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, రైతులు సమాజానికి ఉపయోగపడేలా అనేక ప్రయోగాలు చేస్తుంటారని, అవి బయటకు రావడం లేదని అన్నారు. అలాంటి వారిని గుర్తించేలా డీఈఓ, డీఐఈఓ, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి బయటకు తీసుకురావాలన్నారు. పెద్ద సమస్యలకు చిన్న ఆలోచనతో పరిష్కరించేలా అనేక మంది యంత్రాలు తయారు చేస్తున్నారు. అలాంటి వారు ఇంటింటి ఇన్నోవేషన్ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేలా విస్తృత ప్రచారంతో పాటు అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా డీఈఓ, డీఐఈఓ, వ్యవసాయ శాఖ పాత్ర ఎక్కువగా ఉంటుందని, ఆయా శాఖల అధికారులు కూడా వారి దృష్టిలోకి వచ్చే ప్రయోగాలను ఇన్నోవేషన్‌లో దరఖాస్తులు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలి

- ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తలమడుగు మండలం రేకులగూడెం గ్రామానికి చెందిన ఆత్రం అయ్యుబాయి తనకు రైతుబంధు మంజూరు చేయించాలని కోరారు. జన్నారం మండలం కవ్వాల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ తనకి గోపాలమిత్ర సెంటరు కావాలని, కాజిపేట్ మండలం దేవాపూర్‌కు చెందిన లక్ష్మణ్ తనకు ఏదైనా ఆశ్రమ పాఠశాలలో జాబ్ ఇప్పించమని కోరారు. నేరడిగొండ మండలం రంగం వాడి గ్రామానికి చెందిన రూపాబాయి ఆర్థిక సాయం కావాలని కోరారు. పింఛన్, డబుల్‌బెడ్ రూం, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీఓ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఏపీఓ కనక భీంరావ్, డీఎంజీసీ మేనేజర్ రామనందన్, అదనపు వైద్యాధికారి మనోహర్, పీహెచ్ఓ సందీప్ కుమార్, ఏఓ రాంబాబు, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలి



నవతెలంగాణ-బోథ్

ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో స్థానిక బస్టాండ్ అవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకాన్ని గత రాష్ట్ర ప్రభుత్వం 2020 నుంచి 2023 వరకు ఎలాంటి పంటల బీమా అమలు చేయలేదని అన్నారు. రైతుల పంటకు పూర్తిగా అకాల వర్షాలు వడగండ్ల వానకి దెబ్బతిన్న పంటలకు ఎలాంటి పంట నష్ట పరిహారం రాలేక చాలా ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటైన తరువాత రైతులకు ఫసల్ బీమాను ఈ ఖరీఫ్ సీజన్‌లో అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. గత కొన్ని రోజుల కింద రూ.1500 కోట్లను ఫసల్ బీమా యోజన కింద ఇన్సూరెన్స్ కంపెనీలకి చెల్లించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రతి ఏడాది జులై నెలలోని పంటల బీమా అమలు చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు పంటల బీమాను ఎలాంటి నియమ నిబంధనలు విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కార్యక్రమంలోని రైతులు శేఖర్‌రెడ్డి, జంగు, మురళి, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీడీ కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్

ఈనెల 10న నిర్మల్ జిల్లా కలెక్టరేట్ ఎదురుగా బీడీ కార్మికులు చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేష్ అన్నారు. సోమవారం ఖానాపూర్ పట్టణంలోని విశ్రాంతిభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ మండలంలో పలు గ్రామాలలో బీడీ కార్మికుల కంపెనీలలో విస్తృతంగా కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశామన్నారు. బీడీ కార్మికులకు చేయూత పథకం కింద నాలుగు వేల రూపాయలు బీడీ కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం జీఓ విడుదల చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో బీడీ కార్మికులందరికీ పథకం కింద నాలుగు వేల రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీడీ పరిశ్రమలు పనిచేస్తున్న బీడీ ప్యాకింగ్, కాటన్, నెలసరి ఉద్యోగులకు ఆంక్షలు లేకుండా ఇవ్వాలన్నారు. బీడీ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలిరేట్లు పెంచాల్సిన ప్రభుత్వాలు గత 14 సంవత్సరాలుగా వేతనాలు పెంచడం లేదనీ అన్నారు. ఇన్ని సంవత్సరాలు గడుస్తున్నా జీఓ విడుదల చేయలేదని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కనీస వేతనం జీఓ విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాజీనామా చేసిన కార్మికులందరికీ రూ.10వేలు ఇవ్వాలన్నారు. కార్మికులందరూ ఈనెల 10న నిర్మల్ జిల్లా కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాకు బీడీ కార్మికులందరూ హాజరు కావాలని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం లింగన్న, డివిజన్ నాయకులు మాలావత్ జెవింధ్ మద్దినేని చిన్న రాజన్న, ముంజం దేవేందర్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలను పరిరక్షించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

శాంతిభద్రతలను పరిరక్షించాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటి వర్కింగ్ ప్రెసిడెంట్ కనక యాదవరావు అన్నారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ నాగేందర్‌ను తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనక యాదవరావు, కమిటి సభ్యులతో కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలను పరిరక్షించాలని, ఆదివాసీ యువకుడు అయిన దుర్వ మహేష్ భూవిషయంలో గోడవకు పాల్పడి, కులం పేరుతో దుషించి, చంపుతానాని బెదిరించిన గిరిజనేతరుడు అయిన సిద్దాం రాజేశ్వర్‌పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ విషయంపైన పిటిషన్ ఇచ్చి ఐదు రోజులు అయిన సంబంధిత ఉట్నూర్ ఎస్సై కేసు నమోదు చేయకుండ కాలయాపన చేయడంలో అంతర్యమేమిటని డీఎస్పీకి తెలిపారు. తక్షణమే సిద్దం రాజేశ్వర్ పైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సోంత పట్టాభూమి లేని గిరిజనేతరుడు ఆదివాసీ యువకుడిని బెదిరించి చంపుతానాని బెదిరించడం సరైందికాదన్నారు. తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోక పోతే చట్టప్రకారంగా తాము సైతం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయక్‌పోడ్ సేవా సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు జనగ భీముడు, జిల్లా అధికార ప్రతినిధి ఆడ హన్మంతరావు, సిడం సోనేరావు ఉన్నారు.



మహిళా సంఘం అధ్యక్షురాలిగా లక్ష్మీ



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(బి)లో మహిళ సంఘాల ఆధ్వర్యంలో మొదటి మహిళ సంఘం అధ్యక్షురాలిగా బ్యరపు లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముందుగా మండల ఐకేపీ ఏపీఎం రమేష్ మహిళ సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి మహిళలతో మాట్లాడారు. ప్రతి ఏడాదికి ఒకసారి మహిళ సంఘాలు కలిసి ఒకరిని అధ్యక్షురాలుగా ఎన్నుకోవడం జరుగుతుందని అన్నారు. దీంతో నూతన అధ్యక్షురాలిగా లక్ష్మీ, కార్యదర్శిగా గాయక్వాడ్ జ్యోతి, కోశాధికారి తూము అనిత, సహాయ కార్యదర్శిగా కె.లక్ష్మిని 30 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రెండు మహిళ సంఘాల్లో మొదటి మహిళ సంఘంలో 30 గ్రూపులతో కూడిన సంఘ సభ్యులు అందరూ కలిసి ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని బ్యాంక్ వారు ఇచ్చిన రుణాలను ప్రతి నెల నెలకు క్రమం తప్పకుండా తక్కువ వడ్డీతో కూడిన రుణాలను బ్యాంక్‌కు చెల్లించి మరింత ఎక్కువ రుణాలను అందించేలా కృషి చేస్తామని అన్నారు. దీంతో నూతన అధ్యక్షురాలికి గ్రామ మహిళ సంఘాలు శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రమేష్, సీసీ దత్తాత్రి, సీఏలు సాయినాథ్, రమేష్ మహిళలు ఉన్నారు.

విద్యతోనే గుర్తింపు

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

విద్యతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్డు సమీపంలోని కుమురంభీమ్ స్టడీ సర్కిల్‌ను సందర్శించారు. అక్కడ నాగోరావ్ కొడుకు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఉన్నత చదువులు చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. జీవితంలో ఎన్ని ఒడిదొడుకులు వచ్చిన వాటిని ఎదుర్కొంటూ లక్ష్య సాధన దిశగా పయనించాలని పేర్కొన్నారు. స్టడీ సర్కిల్ అభివృద్ధికి తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కంప్యూటర్, బుక్స్, సరైన వసతులు కల్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు

గిరిజన జీవితాల్లో వెలుగు నింపారు



నవతెలంగాణ-ముథోల్

గిరిజన జీవితాల్లో వెలుగు నింపేందుకు కృషిచేసిన మహనీయుడు రామారావు మహరాజు అని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మండలంలోని విట్టోలి తండాలో రామారావు మహరాజ్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో బాబుసింగ్ మహరాజ్ (పొరదేవి) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. జ్ఞాన జ్యోతి వెలిగించి, గిరిజనులకు విద్య, వైద్యం కోసం కృషి చేశారన్నారు. సంచార జీవితం గడుపుతున్న గిరిజనుల బతుకుల్లో వెలుగులు నింపడం కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

వర్షాకాలంలో జలుబు, దగ్గు, వికారం, ఒళ్లు నొప్పులు, వాంతులు, గొంతు నొప్పి, తీవ్రమైన జ్వరాల పట్ల ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాగర్ అన్నారు. సోమవారం మండలంలోని ముక్రా(కె) గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామ ప్రజలు క్యాంపులో ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సాగర్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముక్రా(కె) గ్రామంలో 59 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, సంబంధించిన వ్యాధులకు మాత్రలు, సిరప్‌లు, అందించినట్టు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. చేతులను బాగా శుభ్రపర్చుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని ధర్నా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణ పరిధిలోని నిషాన్ ఘాట్‌లో నివాసం ఉంటున్న 300 కుటుంబాలకు మౌళిక వసతులు కల్పించాలని సీపీఐ కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట పేదలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలోని నిషాన్ ఘాట్‌లో దాదాపు 300 కుటుంబాలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నరన్నారు. గత బీఆర్ఎస్ హయంలో అనేక ఉద్యమాలు, దీక్షలు చేసిన పట్టించుకోలేదన్నారు. అక్కడ నివాసం ఉంటున్న వారికి మౌళిక వసతులను కల్పించడంతో పాటు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. పట్టాలిచ్చే వరకు ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుంటాల రాములు, అరుణ్ కుమార్, నళినిరెడ్డి, అమీన బేగం పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | జులై 09, 2024 | www.navatelangana.com

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ కోరారు. వీఆర్‌ఏలతో కలిసి అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీఓ నెంబర్ 81,85 ప్రకారం 60 సంవత్సరాలు దాటిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పుడు నిర్ణయాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా 61 సంవత్సరాలు దాటిన 3797 మంది వీఆర్‌ఏ కుటుంబాలు నష్టపోవాల్సి వస్తుందన్నారు. జిల్లాలో 57 మంది వీఆర్‌ఏలు తమ వారసులకు ఉద్యోగాలు రాకుండా ఇబ్బందులు పడుతున్నారని, దీని వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు వెంకటేష్, అంకుల్, రజనీకాంత్, సతీష్ ,కిషోర్, గిర్మాజీ పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని తుంగెడ జడ్పీఎస్ఎస్ పాఠశాల ఆధ్వర్యంలో రెబ్బెన మాజీ ఎంపీపీ సౌందర్య ఆనంద్, మాజీ సర్పంచ్ డోంగ్రి పెంటయ్య, ఉప సర్పంచ్ సాయికృష్ణను సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు వినయ్ కుమార్, ఉపాధ్యాయులు వారికి శాలువతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. గ్రామంతో పాటు పాఠశాల అభివృద్ధికి వారు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం 9 సంవత్సరాలుగా స్కూల్ టీచర్ పనిచేసిన హనుమంతరావు, గోవర్ధన్ వేరే స్కూల్‌కు బదిలీ కావడంతో వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో గేదె మృతి

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని గెర్రె గ్రామంలో విద్యుద్ఘాతానికి గురై గేదె మృతి చెందింది. బాధిత రైతు పాకాల శంకర్ తెలిపిన వివరాల ప్రకారం..ఉదయం మేతకు వెళ్లిన గేదె సమీప పంట చేనుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఉన్న విద్యుత్ తీగ తగిలి మృతి చెందిందన్నారు. గేదె విలువ సుమారు రూ.60000 వేలు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

విధి నిర్వహణలో మద్యం సేవిస్తే ఉపేక్షించేది లేదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విధి నిర్వహణలో మద్యం సేవిస్తే ఉపేక్షించేది లేదని ఆర్టీసీ డిఎం విశ్వనాథ్ అన్నారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆసిఫాబాద్ డిపోకు చెందిన నలుగురు డ్రైవర్లు ఈ జూన్ నెల 27న విధుల్లో భాగంగా హైదరాబాద్‌కు వెళ్ళి అదే రోజు సాయంత్రం వారికి కేటాయించిన రెస్ట్ రూమ్‌లో మద్యం సేవించారని అధికారులకు అనుమానం రావడంతో సదరు సిబ్బందికి పరీక్షలు నిర్వహించారన్నారు. మద్యం సేవించినట్లు రుజువు కావడంతో అక్కడి అధికారులు వివరాలు పంపడంతో మద్యం సేవించిన నలుగురు డ్రైవర్లపై శాఖ పరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో ఎవరైనా ఇష్టానుసారంగా వ్యవహరించిన, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వారి ప్రవర్తన ఉన్నట్లు రుజువైతే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రయాణీకుల క్షేమం, భద్రతనే పరమావధిగా భావిస్తున్న ఆర్టీసీ ఇటువంటి క్రమశిక్షణ ఉల్లంఘనలు ఉపేక్షించదని అందుకే వారిపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

నిషేధిత గుట్కా పట్టివేత

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలో నిషేధ గుట్కా పట్టుకున్నట్లు ఎస్సై గుంపుల విజయ్ కుమార్ తెలిపారు. కెరమెరికి చెందిన వసాకే ప్రకాష్ ప్రభుత్వం నిషేధించిన గుట్కా అమ్ముతున్నాడానే సమాచారం మేరకు అతనికి చెందిన షాప్‌ను తనిఖీ చేశారు. తనిఖీలో రూ.10,960 విలువ గల నిషేధిత గుట్కాని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. గుట్కా అమ్మిన హస్సన్ చౌస్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

సేవ చేయడం గొప్ప విషయం



నవతెలంగాణ-దహెగాం

విద్యార్థులు, పేద ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయమని ఎస్సై కందూరి రాజు అన్నారు. మండలంలోని మర్రిపల్లె గ్రామంలో సోమవారం పుప్పాల మల్లక్క ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ పుప్పాల శ్రీనివాస్ విద్యార్థులకు నోటు బుక్కులు, పెన్నులు అందజేశారు. అలాగే గ్రామంలో 60 సంవత్సరాలలోపు గల వారందరికీ గ్రామీణ బ్యాంక్‌లో తన సొంత డబ్బులతో ఇన్సూరెన్స్ పాలసీలను చేయించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై మాట్లాడుతూ ప్రపంచంలో ఎంతో మంది ధనికులు ఉన్నప్పటికీ సేవ చేయాలని ఆలోచన ఉండదన్నారు. ఉన్నంతలో సేవ చేయాలనే ఆలోచన గొప్పదన్నారు. కొన్ని సంవత్సరాలుగా పుప్పాల శ్రీనివాస్ ఒక ట్రస్టును ఏర్పాటు చేసుకొని సేవ చేస్తున్నారంటే సంతోషకరమైన విషయం అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్యామల, నాయకులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్‌ఆర్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-కౌటాల

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంపీ వైద్యుడు బొద్దున సత్యనారాయణ మాట్లాడుతూ వైద్య వృత్తికి వన్నె తెచ్చిన మహానియుడు వైఎస్‌ఆర్ అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ అందుబాటులోకి తెచ్చి మరువలేని సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీలు కైలాసం, రాజేశ్వర్ పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గుర్నులే నారాయణ, నాయకులు జమల్‌పూరి సుధాకర్, ప్రశాంత్, దాదాజీ, రమేష్ గణేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండెనొప్పితో ఉపాధ్యాయుడు మృతి

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు మడావి రాజేశ్వర్ గుండెనొప్పితో మహారాష్ట్రలోని చంద్రాపూర్ ఆస్పత్రిలో సోమవారం మృతి చెందాడు. మృతుడు తిర్యాణి మండలంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఉపాధ్యాయుడి మృతిపట్ల ఉపాధ్యాయుల సంఘం ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే
- ఇంటింటా ఇన్నోవేటన్ పోస్టర్ల ఆవిష్కరణ



ఇన్నోవేటర్ పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నోవేటర్-2024 కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల నుండి ప్రజా ఉపయోగకరమైన ఆవిష్కరణలను ప్రోత్సహించడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీఓలు లోకేశ్వరరావు, కాసబోయిన సురేష్‌లతో కలిసి ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమ గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ఆవిష్కర్తలకు సాధికారత కల్పించి నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. అద్భుతమైన ఆలోచనలు, ప్రాజెక్టులు రూపొందించిన అన్ని వర్గాల ఆవిష్కర్తల నుండి ఆవిష్కరణలను స్వీకరిస్తామన్నారు. గొప్ప ఆవిష్కరణలను ఎంపిక చేసి ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సంబంధిత ఆవిష్కర్తలకు అవార్డు ప్రధానం చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం జిల్లాకు ఒకరు చొప్పున యువ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమించి ఇన్నోవేషన్ మిత్రాలుగా 3 నెలల కాలానికి సమన్వయకర్తలుగా పనిచేసి జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజ సంస్థలు, గ్రామీణ ప్రజలతో సహా విభిన్న వాటాదారులతో నిమగ్నమై మారుమూల గ్రామాలకు కూడా ఆవిష్కరణ ప్రాముఖ్యతను తెలియజేస్తారన్నారు. నూతన ఆవిష్కరణలను తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తారని తెలిపారు. ఆవిష్కర్తలు దరఖాస్తులను నేరుగా వాట్సాప్ ద్వారా 9100678543 పంపించవచ్చని, దరఖాస్తులు ఆవిష్కర్త పేరు, వయసు, ఫోటో, వృత్తి, చిరునామా, ఆవిష్కరణ పేరు, 100 పదాలతో ఆవిష్కరణ వివరణ, ఆవిష్కరణ సంబంధిత హై రిజల్యూషన్ కలిగిన 4 ఫోటోలు, ఆవిష్కరణ విధులను ప్రదర్శించే 2 వీడియోలు ఆగస్టు 3లోగా పంపించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాణ
- జీఎం కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు



రిలే దీక్షలో ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-రెబ్బెన

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను ఆపి సింగరేణికి కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ అన్నారు. సోమవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని వేయడాన్ని వెంటనే మానుకోవాలని, క్యాపిటల్ విధానంలో తెలంగాణ బొగ్గు బ్లాకులు తెలంగాణకు ఇవ్వాలన్నారు. మూడోసారి గెలిచిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్మిక వ్యతిరేక విధానాలను చేపట్టి కార్పోరేట్ సంస్థలకు కొమ్ముకాసే విధంగా దొంగ చట్టాలను రూపొందిస్తుందని మండిపడ్డారు. శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గుబ్లాకును కేంద్ర ప్రభుత్వం వేలంపాట ద్వారా ప్రయివేట్ సంస్థలకు బొగ్గు గనులు తవ్వే అవకాశం కల్పించడం సరైంది కాదన్నారు. మన రాష్ట్రం నుండి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలం పాటను ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. పది సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం దాదాపుగా 200 బొగ్గు బావులను ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టారని ఆరోపించారు. ప్రస్తుతం సింగరేణిలో 40వేల మంది పర్మినెంట్ కార్మికులు ఉంటే మరో 30 నుండి 33,000 మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల తెలంగాణకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ సెక్రటరీ ఎస్.తిరుపతి ఉపాధ్యక్షులు బయ్యమగుడి, సీపీఐ మండల సహాయ కార్యదర్శి బి జగ్గయ్య, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి రాయల్ నరసయ్య, గడ్డం రమేష్, కార్మిక నాయకులు మారం శ్రీనివాస్, జూపక రాజేష్, కే కిరణ్, డి దివాకర్, శేషు, శేనారావు ఏ సుధాకర్, సుధీర్ కుమార్, తిరుమలేష్ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అధికారులు ముందుండాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ముందుండాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీఓలు లోకేశ్వరరావు, కాసబోయిన సురేష్‌లతో కలిసి అర్జీ దారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కృషి చేయాలన్నారు. దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించినప్పుడే అధికారులకు గుర్తింపు వస్తుందన్నారు.

దహెగాం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు దరఖాస్తుదారులు రాలేదు. గ్రామాలలో ప్రజలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు పూర్తిస్థాయిలో తెలియకపోవడంతోనే అర్జీలు పెట్టుకునేందుకు రాలేదని తెలిసింది. దీంతో ప్రారంభం రోజు ఎలాంటి దరఖాస్తులు లేకుండానే ప్రజావాణి కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, ఎంపీడీఓ రాజేందర్, ఏపీఎం చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇనోస్ పాల్గొన్నారు.

రేపటి ధర్నాను జయప్రదం చేయాలి : సీఐటీయూ



కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

డిమాండ్స్ డే సందర్భంగా అన్ని మండలకేంద్రాల్లో కార్మికుల ఆధ్వర్యంలో ఈనెల 10న జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎలుకపెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీఐటీయూ మండల గౌరవధ్యక్షుడు శ్రీకాంత్ అధ్యతన యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని, సింగరేణికే నేరుగా గనులు కేటాయించాలని, కార్మికులందరికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. అలాగే అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నభోజనం, వైద్య, ఆరోగ్య రంగంతో పాటు వివిధ స్కీంలలో పనిచేస్తున్న స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ వర్కర్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజెల్స్ అందరిని అర్హతలను బట్టి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు శ్యామల, ఐకేపీ వీఓఏలు సుశీల, సంగీత, అంకిత, మధ్యాహ్నభోజన కార్మికులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆదర్శ హాస్టళ్లల్లో సీట్ల సంఖ్య పెంచాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని రెండు ఆదర్శ పాఠశాల హాస్టల్లో సీట్ల సంఖ్యను పెంచాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేకమంది పేద విద్యార్థులు ఆదర్శ పాఠశాలల్లో చదువుకుంటున్నారన్నారు. జిల్లాలోని మారుమూల మండలాల నుండి వచ్చి చదువుతున్నారని అయితే వీరికి హాస్టల్ వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. జిల్లా కేంద్రంతో పాటు సిర్పూర్(యు)లో ఉన్న ఆదర్శ పాఠశాలల్లో హాస్టల్ సీట్ల సంఖ్యను 100 నుండి 200కు పెంచాలని డిమాండ్ చేశారు. ఆదర్శ పాఠశాలలో అవసరమైన వసతి ఉన్నప్పటికీ విద్యార్థులను కేటాయించకపోవడంతో వారు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. జిల్లాలో ప్రతి మండలానికి ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జాడి విలాస్, దుర్గం కొటేశ్వర్, కుర్సెంగ హరిశ్చంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీల శిక్షణ

నవతెలంగాణ-దహెగాం

మండల కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీల శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా సీడీపీఓ సురేఖ మాట్లాడుతూ అజిత్ ప్రేమ్ జి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు ప్రాథమిక విద్య బోధనపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రాథమిక విద్య బోధన తీరు అంగన్‌వాడీ పిల్లలను ప్రాథమిక విద్య వైపు ఏ రకంగా మళ్లించాలి, ఏ రకంగా వారికి విద్య వైపు ఆకర్షితులను చేయాలో ప్రొజెక్టర్ ద్వారా ట్రెనింగ్ ఇచ్చామని తెలిపారు. వాటికి సంబంధించిన పుస్తకాలను సైతం అందించామన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రెనర్ సరోజినీదేవి, సూపర్‌వైజర్ అనసూర్య, ఆయా గ్రామాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్ కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజు సోమవారం కొనసాగాయి. ఈ సందర్భంగా దీక్షలకు సంఘీభావం తెలిపి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్‌కు నష్టం కలిగించే జీఓ నెంబర్ 10ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌లకు రూ. రెండు లక్షలు, హెల్పర్స్‌కు రూ.లక్ష కల్పించి, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వారి సమస్యలపై స్పందించి పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉమ, లక్ష్మి, బతుకమ్మ ఛాయ, శంకరమ్మ, స్వర్ణ, లక్ష్మి, విఠుబాయి, రత్నమాల పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని గజ్జిగూడ గ్రామానికి చెందిన ఓ కుటుంబంలోని తల్లీ, ఇద్దరు కూతుళ్లు ఇటీవల పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా బాధిత కుటుంబీకులకు స్థానిక యువకులు ఆర్థిక సాయం అందించారు. సోమవారం ఇనుముల ఉమాకాంత్, పుల్ల శ్రీకాంత్ దాతల సహకారంతో సేకరించిన రూ. 40,300 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఒకే కుటుంబానికి చెందిన చిలుకూరి అనిత, రమ్య, లక్ష్మిలు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. గ్రామంలో విషాదం నింపిన ఈ ఘటనతో చలించిన యువకులు పలు సామాజిక మాధ్యమాల ద్వారా దాతల నుంచి సాయాన్ని సేకరించారు. మంచిర్యాలలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో మరో కూతురు ఐశ్వర్య చికిత్స పొందుతుండగా అక్కడే బాధిత కుటుంబీకురాలికి ఆర్థిక సాయాన్ని అందించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనం పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి

ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా పశువులను తరలిస్తున్న ఐచర్ వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నవెదరి గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా వాంకిడి వైపుకు వస్తున్న ఐచర్ వాహనంపై అనుమానం వచ్చి తనిఖీ చేశారు. అందులో ఐదు ఆవులు, రెండు దూడలను తరలిస్తున్న విషయాన్ని గమనించి ఐచర్ వ్యాన్ డ్రైవర్ మహ్మద్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఐచర్ వాహనాన్ని వాంకిడి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు తెలిపారు. పశువులను ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా కబేళాలకు తీసుకెళ్తున్న విషయం తెలిసిందే. గోయగావ్ గ్రామానికి చెందిన ఐచర్ వ్యాన్ డ్రైవర్ మహ్మద్‌ఖాన్‌పై ఏఎస్ఐ పోశెట్టి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సాగర్ తెలిపారు.

విదేశీ విద్యకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

2024 విద్యా సంవత్సరానికి గాను మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించేందుకు మైనారిటీ అభ్యర్థుల (ముస్లీం, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు) నుండి ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం కింద దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆర్. రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ (ఇంజనీరింగ్)లో 60 శాతం మార్కులు ఉండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయడానికి, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 60 శాతం మార్కులు కలిగి పీహెచ్‌డీ చేయాలనుకునేవారు మాత్రమే అర్హులని, అభ్యర్థులు స్ప్రింగ్ సీజన్ 2024 (జనవరి 1, 2024 నుండి జూలై 31, 2024)లో ఎంపిక చేయబడిన విదేశీ విశ్వవిద్యాలయాలలో అడ్మిషన్ పొంది ఉండాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ధృవపత్రాలతో ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణ ఈపాస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా ఆగస్టు 7 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత ప్రతులను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆగస్టు 27వ తేదీలోగా సమర్పించాలని తెలిపారు. ఆసక్తి, అర్హత కల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆర్టీసీ సూపర్ లగ్జరీ టికెట్‌లో పది శాతం రాయితీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ బస్సుల్లో ఆసిఫాబాద్ నుండి హైదరాబాద్ సూపర్ లగ్జరీ, లహరి సర్వీసులకు హైదరాబాద్ పోవడానికి రావడానికి టికెట్ బుక్ చేసుకుంటే తిరుగు ప్రయాణంలో 10 శాతం రాయితీ సౌకర్యం పొందవచ్చునని డిపో మేనేజర్ విశ్వనాథ్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్టీసీలో సురక్షితమైన శుభవంతమైన ప్రయాణం చేయాలన్నారు. టికెట్ల బుకింగ్‌కు టీజీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్ లేదా ఆథరైజ్డ్ బుకింగ్ సెంటర్లలో వద్ద చేసుకోవచ్చునని సూచించారు.

కొంచవెల్లి వారసంత వేలంపాట

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని కొంచవెల్లి గ్రామంలో ప్రతి ఆదివారం నిర్వహించే వార సంత, తైబజార్ వేలంపాట బుధవారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాకేష్ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.25000 ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలం అనంతరం వేలంలో మూడో వంతు డబ్బులు చెల్లించాలని సూచించారు. మిగిలిన డబ్బులు గ్రామపంచాయతీ నిబంధనల ప్రకారం చెల్లించాల్సి ఉంటుందని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | జులై 09, 2024 | www.navatelangana.com

ఆన్‌లైన్‌లో పంటల నమోదు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కవ్వాల్ వ్యవసాయ క్లస్టర్‌లోని గ్రామాల్లో ఈ ఖరీఫ్‌లో రైతులు వేసుకున్న పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని కవ్వాల్ ఏఈఓ అక్రముల్లా ఖాన్ తెలిపారు. రైతులు వేసుకున్న పత్తి, మొక్కజొన్న, మిరప ఏ పంటలైనా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ ప్రక్రియకు రైతులు సహకరించాలని కోరారు. ప్రక్రియను సోమవారం ఉదయం నుంచి ప్రారంభించామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో కవ్వాల్ క్లస్టర్ రైతులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం

నవతెలంగాణ-కాసిపేట



మండలం కేంద్రంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరస్వామి ఆధ్వర్యంలో ప్రమోషన్ పొంది బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు అర్చన, అనసూర్యలకు శాలువాలతో సత్కరించారు. దీంతో పాటు నూతనంగా బదిలీపై పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు తిరుపతి, చంద్రశేఖర్‌లను సన్మానించి స్వాగతం పలికారు. సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరి, జ్యోతి, పల్లె కృష్ణ గోపాల్ రావు, మాధవి లత, విద్యార్థులు పాల్గొన్నారు.

రిలే దీక్షలకు ప్రభుత్వం స్పందించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్



నవతెలంగాణ-నస్పూర్

అంగన్‌వాడీ ఉద్యోగుల రిలే దీక్షపై ప్రభుత్వం స్పందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల రిలే నిరవధిక దీక్ష రెండో రోజుకు చేరిన సందర్భంగా దీక్షకు ఐకేపీ వీఓఏ, పశుమిత్ర సంఘాలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏండ్లుగా పనిచేసిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని పలు దఫాలుగా విన్నవించిన పరిష్కారం చేయకపోవడంతో చివరికి రిలే నిరవధిక దీక్ష చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి, జిల్లాల ఎమ్మెల్యేలు స్పందించాలన్నారు. అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించి రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఆసరా పింఛను, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నీ వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు కుంటాల కుమార్, సమ్మయ్య, బింసేన్, సరోజ పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు అండగా ఉండాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

అణగారిన వర్గాలకు అండగా ఉంటు పేదలకు న్యాయం జరిగేలా చూడాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తోగరు రాజు సూచించారు. సోమవారం మండలంలోని బలరావుపేటకు చెందిన వేల్పుల సత్యం ఏజీపీగా ఎన్నికైన సందర్భంగా సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఓ ఫంక్షన్ హాల్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రోజు కూలీ పని చేసుకునే నీరుపేద కుటుంబంలో పుట్టి తల్లి వేల్పుల భూమవ్వ ప్రోద్భలంతో కష్టపడి చదివి మారుమూల గ్రామం నుండి ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసుకున్నాడన్నారు. లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ఏజీపీగా ఎన్నికవడం గొప్ప విషయమన్నారు. అనంతరం మాజీ జడ్పీటీసీ ముత్తె సత్తన్న, బలరావ్‌పేట నాయకులు ధనిశెట్టి మల్లేష్, శ్రీకర్, గణపతి, ఓదన్నా, సత్తయ్య ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు అవునూరి లచ్చన్న, మండల ప్రధాన కార్యదర్శి బైరం రవి, మాజీ మండల అధ్యక్షుడు దొంత నర్సయ్య, అసాది పురుషోత్తం, గుత్తికొండ శ్రీధర్, గరిసే రవీందర్, గోల్కొండ సత్తయ్య, మండల ఉపాధ్యక్షులు చొప్పదండి రమేష్, బైరం లింగన్న, అలుగునూరి నరేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, ఉపాధ్యక్షులు కల్లేపల్లి విక్రమ్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి వాటర్ ప్యూరిఫైయర్ విరాళం



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగుల సౌకర్యార్థం స్థానిక పాత్రికేయుడు, జర్నలిస్ట్ సంఘం జిల్లా నాయకుడు ఎండీ ముస్తఫా వాటర్ ప్యూరిఫైయర్‌ను విరాళంగా అందజేశారు. వైద్యం కోసం వచ్చే రోగులకు తాగునీటి వసతి కల్పించేందుకు దీన్ని అందజేసినట్లు ముస్తఫా తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను వైద్యుడు క్రాంతి కుమార్ అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనక జంగు, నాయకులు లచ్చన్న, పోశన్న, నాగమల్లు పాల్గొన్నారు.

కర్షల ఘట్టంలో ఆరోగ్య శిబిరం



నవతెలంగాణ-తాండూర్

తాండూర్ గ్రామపంచాయితీ పరిధిలోని కర్షల ఘట్టం అవాసంలో స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎం తులసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మాత్రలు అందజేశారు. వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి చుట్టు నీటిని నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తపాస్ కుమార, హెచ్‌వీ తారాబాయి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు ఇసా, సిరంగి శంకర్, ఆశ కార్యకర్తలు మల్లీశ్వరి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కర్షల ఘట్టం ఆవాసంలో ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటిఇంటికి తిరుగు ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేశారు. నాటిన మొక్కలు సంరక్షించుకోవాలని ఎంపీడీఓ గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి తపాస్ కుమార్, ఉపాధి హామీ ఏపీఓ నందకుమార్ ఈసీ రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఇసా, మాజీ ఎంపీటీసీ సిరంగి శంకర్, టీఏలు లక్ష్మి, రమేష్, అరుణ్, భార్గవ్, ఎఫ్ఏ రాజేశ్వరి పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్



నస్పూర్ : అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్

నవతెలంగాణ-నస్పూర్

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్‌తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణిలో 54 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వేమనపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల పంచాయతీ అధికారి అనిల్ కుమార్ అధ్యక్షతన ప్రజావాణి నిర్వహించారు. ప్రజావాణికి ఎలాంటి అర్జీలు రాలేదు. మండల స్థాయి అధికారులు కూడా పూర్తి స్థాయిలో హాజరు కాలేదు. మండల పరిధిలో నిర్వహించిన ప్రజావాణికి మూడు నుంచి నాలుగు శాఖల అధికారులు మాత్రమే హాజరుకాగా, ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి స్పందన కరువైంది. ఫిర్యాదులు సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే కారణంగా ప్రజలు ఫిర్యాదులు ఇవ్వడానికి రావడం లేదని తెలుస్తుంది. ప్రజావాణికి తహసీల్దార్ రమేష్, ఏపీఓ సత్యప్రసాద్, పశు వైద్యాధికారి డా.అరుణ, ఐకేపీ సీసీ శివరాం, ఎంఐసీ కోఆర్డినేటర్ సుజాత, సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జన్నారం : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శశికళ, తహసీల్దార్ రాజా మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదులతో వచ్చిన వారికి తక్షణమే సమస్యలను పరిష్కరిస్తున్నామని, ఇక్కడ పరిష్కారం కాని సమస్యలను కలెక్టరేట్‌కు పంపుతున్నామని వారు తెలిపారు. ఈ ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఈఓపీఆర్డీ రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వేమనపల్లి : అర్జీలు రాక ఖాళీగా కూర్చున్న అధికారులు



జన్నారం : ఫిర్యాదుల విభాగంలో తహసీల్దార్,ఎంపిడిఓ, అధికారులు

ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణే కీలకం

- శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి



ఎస్డీఎల్ యంత్రాలను ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

నవతెలంగాణ-నస్పూర్

ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణే కీలకమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నస్పూర్ సివిల్ ఆఫీస్ కార్యాలయంలో సుమారు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో మూడవ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. దీనిని ఉద్యోగులు ఉపయోగించుకోవాలని, సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి ఆరోగ్య పరిరక్షణలో తమ వంతు కృషి చేస్తుందని తెలిపారు. అలాగే సంస్థ అందిస్తున్న మౌలిక సదుపాయాలను వినియోగించుకొని ఉద్యోగులు వారి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కొమురయ్య, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కె వెంకటేశ్వర్ రెడ్డి, ఇన్‌చార్జీ ఎస్ఓ టూ జీఎం ఏవీ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ అరవింద రావు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఇన్‌చార్జీ డీజీఎం సివిల్ రాము, సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, సీనియర్ పీఓ కాంతారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సివిల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్డీఎల్ యంత్రాల ప్రారంభం

నూతన యంత్రాల వినియోగంతో ఉత్పత్తి ఉత్పదకత గణనీయంగా పెరుగుతుందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. గురువారం ఆర్కే5 గనిలో 2 నూతన ఎస్డీఎల్ యంత్రాలను జీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.50 లక్షల ఒక్కో ఎస్డీఎల్ యంత్రం కొనుగోలు చేయడం జరిగిందని, వీటి ద్వారా సాధ్యమైనంత ఎక్కువ బొగ్గును ఉత్పత్తి చేస్తూ సంస్థ లాభాల బాట వేయడానికి కృషి చేయాలని సూచించారు. అలాగే శ్రీరాంపూర్ ఏరియాలో మరికొన్ని నూతన యంత్రాలను త్వరలో తీసుకువస్తామన్నారు. ఈ నూతన యంత్రాల ద్వారా కూడా వారి వార్షిక నిర్దేశిత లక్ష్యాలను సాధిస్తుందని నమ్మకం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కొమురయ్య, అధికారులు సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కె వెంకటేశ్వర్ రెడ్డి, ఇన్‌చార్జీ ఎస్ఓ టూ జీఎం ఏవీ రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సర్పాలన్నీ విషపూరితమైనవి కావు

- మంచిర్యాల అటవీ క్షేత్రాధికారి రత్నాకర్‌రావు

నవతెలంగాణ-జైపూర్

ప్రకృతితో మమేకమై సంచరించే సర్పాలన్ని విషపూరితమైనగా పరిగణించకూడదని మంచిర్యాల అటవీ క్షేత్రాధికారి రత్నాకర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం సింగరేణి స్నేక్ సొసైటీ సభ్యులతో సర్పాలపై అవగాహన కల్పించారు. సర్పాలకు చెవులుండవని, ఇప్పటి వరకు 2900 జాతులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. జూలై 16న ప్రపంచ పాముల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. స్నేక్ సొసైటీ సభ్యుడు రాజు మాట్లాడుతూ తెలంగాణలో సాధారణంగా 3 రకాల విషపూరిత(రక్త పింజర, నాగు పాము, కట్ల పాము) సర్పాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. అదే విధంగా విషం లేకుండా ఉన్న పాములు (జెడుగ, పసిరక, వాన కోయిల, మట్టిపాము, రెండు తలల పాము)లు చారలను బట్టి, రంగును బట్టి పాములు ఏ జాతికి చెందినవో తెలుసుకోవడంతో పాటు జాగ్రత్తలు తీసుకుంటే పాము కాటు నుండి దూరంగా ఉండే విధానం వివరించారు. ఇంటి పరిసరాలకు దరిదాపుల్లో రాకుండా ఉంటడం, పాము కాటుకు గురైనప్పుడు ఆ ప్రదేశంలో కట్టు కట్టడం సరికాదని, నోటి ద్వార ఆ ప్రాంతం నుండి రక్తం పీల్చడం చేస్తే ఇద్దరికి ప్రాణపాయం ఉంటుందన్నారు. వీలైనంత వరకు తొందరగా ప్రాథమిక చికిత్స అందించి దగ్గరిలోని ఆస్పత్రికి తీసుకెళ్తే ప్రాణాపాయం నుండి కాపాడుకోవచ్చునని తెలిపారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు సాగరిక, రాంసింగ్, అనుష, ఎఫ్‌బీఓ ఫణిబాల, ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్నేక్ సొసైటీ టీం సభ్యులు

కస్తూరిబా విద్యార్థినులకు వైద్య పరీక్షలు



నవతెలంగాణ-తాండూర్

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో సోమవారం ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భం డా.రామకృష్ణ వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఇక్కడి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శిరీష, కేజీబీవీ ఇన్‌చార్జీ ఎస్ఓ సుమన చైతన్య, ఫార్మసిస్టు సంతోష్, ఏఎన్ఎం సరిత, సిబ్బంది, విద్యార్థులను పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు, పెన్నుల పంపిణీ

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని వందూర్ గూడ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న సుమారు 30 మంది గిరిజన విద్యార్థులకు నోట్స్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. దండేపల్లికి చెందిన ఉపాధ్యాయుడు కొండు రామన్న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తన మనవరాలు తన్వి అమేయ జన్మదినాన్ని పురస్కరించుకొని నోటు పుస్తకాలు, పెన్నులు పెన్సిళ్లు అందజేశారు. జన్మదినం సందర్భంగా సేవ కార్యక్రమం చేపట్టడం పలువురు అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మాదంశెట్టి మల్లికార్జున్, సభ్యులు జాబు సుగుణాకర్, పసర్తి సత్తయ్య, కొండు రామన్న, ఉపాధ్యాయుడు గోళ్ల గంగన్న పాల్గొన్నారు.



ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ 75వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు సోతుకు సుదర్శన్ మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి 1600 కిలోమీటర్లు పాదయాత్ర చేసి కష్టాలు తెలుసుకున్నారన్నారు. ముఖ్యమంత్రిగా గెలిచిన తర్వాత ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత కరెంటు, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇల్లు, 104, 108వాహనాలు, భూములేని వారికి భూమిచ్చిన గొప్ప నాయకుడని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కడలి శ్రీనివాసరావు, జమల్పురి నర్సుజి, ఆవుల సాయి కృష్ణ, ఏనుగుల బీరయ్య శంకరయ్య మురారపు శేఖర్, సునర్కర్ రాంబాబు, జంగంపల్లి రాజేష్ పాల్గొన్నారు.

జన్నారం : తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని గాంధీభవన్, ఆంధ్ర భవన్‌లో వేరువేరుగా మండల కాంగ్రెస్ నాయకులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ మాట్లాడుతూ ఆయన హయాంలో ఆరోగ్యశ్రీ, పథకాన్ని ప్రవేశపెట్టి పేదలకు ఉచిత వైద్యాన్ని అందించిన మహనీయుడదని కొనియాడారు. పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏనుగు సుభాష్ రెడ్డి, గుర్రం మోహన్ రెడ్డి, మల్యాల బాపన్న, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఫసియుల్లా, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు ఎండి రియాజ్, అజహర్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, నాయకులు సయ్యద్ ఇసాక్, మచ్చ శంకరయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో శుభ్రత పాటించాలి



నవతెలంగాణ-జైపూర్

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు అందించే ఆహారంలో శుచి శుభ్రత పాటించాలని ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణ గౌడ్ సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్, ఎంపీఓ శ్రీపతి బాపుతో కలిసి సోమవారం గ్రామపంచాయతీ పరిధిలో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న వస్తు సామాగ్రి రికార్డులు తనిఖీ చేసిన ఆయన వస్తు సామాగ్రి నిల్వలు రోజు వారిగా నమోదు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను పరిశీలించారు. కేంద్రాలకు వచ్చే విద్యార్థులతో పాటు ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశీలించి పారిశుద్ధ్యపు పనుల పట్ల శ్రద్ధ చూపించాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోరు బావుల ద్వార ప్రతి ఇంటికి నీటి సరఫరా కొనసాగాలని, అదనపు కనెక్షలుంటే వాటిని తొలగించి కనెక్షన్ లేనివారికి ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అదేవిధంగా ఇందారం 1ఏ గని క్యాంటీన్ సందర్శించిన ఆయన క్యాంటీన్ ద్వార పౌష్టికరమైన ఆహారం అందించాలన్నారు. క్యాంటీన్ కోసం నిర్మించిన షెడ్డుకు గ్రామ పంచాయతీ పర్మిషన్ తీసుకోవాలన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత నస్పూర్



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లా ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ పోటీల్లో జిల్లా నుండి మొత్తం 12 జట్లు పాల్గొనగా నస్పూర్- బెల్లంపల్లి జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. సోమవారం శ్రీరాంపూర్‌లోని కృష్ణ కాలనీ శాంతి స్టేడియంలో ఫైనల్ పోరు జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నస్పూర్ జట్టు నిర్దిత ఓవర్లలో 92 పరుగులు సాధించగా బెల్లంపల్లి జట్టు 64 పరుగులకె పరిమితమైంది. విన్నర్స్‌గా నిలిచిన నస్పూర్ జట్టులో చిన్న సుధాకర్ చక్కటి ప్రతిభ కనబరిచి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కైవసం చేసుకున్నాడు. విన్నర్స్, రన్నర్స్ జట్లకు అసోసియేషన్ సభ్యులు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నల్ల సతీష్ మాట్లాడుతూ క్రీడలు మానసికొల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ మానసిక ఒత్తిడిని జయించడానికి ఇలాంటి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో అందరూ క్రీడాస్ఫూర్తితో ఆటలు కొనసాగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గని రవీందర్, కోశాధికారి శ్రీపతి రవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కనకయ్య గౌడ్, ఆర్గనైజర్స్ ముక్కెర శ్రీను, చిన్న సుధాకర్, నూనె సురేష్, సాంబారు రాము, లడ్డ సాయి, మేరుగు భానుప్రకాష్, అభిలాష్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లి ఆలయ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని మేదరిపేట గ్రామ పోచమ్మ తల్లి ఆలయ కమిటీని సోమవారం ఆలయం వద్ద ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా నలిమెల శంకరయ్య, అధ్యక్షునిగా పత్తిపాక రవితేజ, ఉపాధ్యక్షులుగా ముత్తినేని మల్లేష్, గడ్డం రామ్‌చందర్, కటకం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బండారి రమేష్, కోశాధికారిగా ఖమ్మం అంజి, సంయుక్త కార్యదర్శిలుగా ఎడ్ల రాజన్న, గడ్డం శ్రీనివాస్, పత్తిపాక సంతోష్, బియ్యాల శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా మైలారం సత్యనారాయణ, చొప్పదండి రమేష్, చీర్ల స్వామి, పిట్టల అశోక్, మిల్యాక్రి, శంకరయ్య గందె రమేష్, ముఖ్య కార్యవర్గ సభ్యులుగా వేముల రామన్న, కుర్సెంగా అరుణ్, ముత్తినేని బుచ్చన్న, కుర్సెంగా కిషన్, మడవి దేవరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | జులై 09, 2024 | www.navatelangana.com

అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో సంకల్ప్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ 100 డేస్ కార్యక్రమంలో భాగంగా అవగాహన చేపట్టారు. సోమవారం పట్టణంలోని సుందరయ్యనగర్, రణదీవేనగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు మెటర్నటీ బెనిఫిట్స్, హెల్త్ న్యూట్రిషన్స్, ప్రభుత్వ పథకాలు గురించి, జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ రాధా, విఠబాయి ఉన్నారు.



సీఏపీఎఫ్ అసిస్టెంట్ కమాండర్‌గా ప్రద్యుమ్నరెడ్డి

నవతెలంగాణ-తలమడుగు

సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ప్రొటెక్షన్ విభాగంలో అసిస్టెంట్ కమాండర్‌గా మండల కేంద్రానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి పెద్ద కుమారుడు ప్రద్యుమ్నరెడ్డి ఉద్యోగం సాధించాడు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇంటికి వెళ్లి అభినందించి, శాలువాతో సన్మానించారు. సన్మానించిన వారిలో రిటైర్డ్ ఉపాధ్యాయులు నల్ల రత్నాకర్‌రెడ్డి, తండ్రి రాజశేఖర్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు ఉన్నారు.



కొడుకు చేతిలో తల్లి దారుణ హత్య



నవతెలంగాణ-లోకేశ్వరం

కన్న కొడుకు చేతిలోనే తల్లి దారుణ హత్యకు గురైన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీనగర్ తండాలో నివాసం ఉంటున్న లవుడే ఇందిరాబాయి(65)ను ఆమె కన్న కొడుకు రాంబాబు కొడవలితో పొడిచి హత్య చేశాడు. గత కొద్ది రోజులుగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని సోమవారం ఉదయం కూడా తల్లి కొడుకులు ఇద్దరు గొడవపడగా క్షణికావేశంలో చిన్న కుమారుడు రాంబాబు, కొడవలితో తల్లిని కడుపులో పొడవగా సంఘటన స్థలంలోనే ఇందిరాబాయి మృతి చెందిందని తెలిపారు. సంఘటన స్థలాన్ని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, ముధోల్ సీఐ మల్లేష్, లోకేశ్వరం ఏఎస్సై దిగంబర్ సందర్శించి, వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పరిశీలించి, పోస్ట్‌మార్టం నిమిత్తం భైంసా ఆస్పత్రికి తరలించారు. కాగా మృతురాలి భర్త లవుడే తర్జన్, ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ మండల అధ్యక్షుడు, సొనాల గ్రామాభివృద్ధి కమిటీ చైర్మెన్ తుల శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ నేను 1990 సంవత్సరంలో ఇదే పాఠశాల నుంచి పదో తరగతిలో ప్రథమ స్థానం ఉత్తీర్ణత పొందానని అన్నారు. అలాగే న్యాయ విద్యను అభ్యసించి, అడ్వకేట్‌గా పని చేస్తూ, రాజకీయ రంగంలోకి రావడం జరిగిందన్నారు. ఈ విద్యార్థులందరూ కూడా చక్కగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు సాధించాలని కోరారు. ప్రతి విద్యార్థి చక్కని క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా తయారు కావాలని సూచించారు. అనంతరం ఇటీవల పదోన్నతులు పొంది పాఠశాలకు వచ్చిన 15 మంది ఉపాధ్యాయులకు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేశ్‌ముఖ్ సచిన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జైలులో ఖైదీలకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా జైలులో ఖైదీలకు జైలు సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మెడికల్ క్యాంపు నిర్వహించి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డీఎల్ఎస్ఏ ఆదేశాల మేరకు రిమ్స్ వైద్యుల బృందం డాక్టర్ నవీన్ (జనరల్ మెడిసిన్), ఎం.వివేక్ (ఆర్థోపెడిక్), భాను జెన్నిఫర్ (ఈఎన్టీ), ఫయాజ్ అష్రఫ్ (జనరల్ మెడిసిన్), సచిన్ రెడ్డి (డెంటిస్ట్), డీఎంహెచ్‌ఓ రాథోడ్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ సమక్షంలో వారికి వైద్యపరీక్షలు చేశారు. ఈ క్యాంప్‌లో మొత్తం 135 మంది ఖైదీలను వైద్య పరీక్షలు నిర్వహించగా, అందులో జనరల్ మెడిసిన్‌లో 62 మంది, ఆర్థోపెడిక్‌లో 28 మంది, ఈఎన్టీలో 18 మంది, 12 మంది డెంటల్, 12 మంది కంటికి సంబంధించిన సమస్యలు గాను అవసరముగు వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా ఇందులో 8 మంది ఖైదీలకు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు సూర్యప్రకాష్‌రెడ్డి, మధు, ప్రకాష్, కృష్ణ, మెడికల్ సిబ్బంది దామోదర్, ఫార్మసిస్ట్ హారిక, రిమ్స్ మెడికల్ సిబ్బంది, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కార్మికుడు సంఘంలో సభ్యునిగా ఉండాలి

నవతెలంగాణ-తాంసి

ప్రతీ కార్మికుడు సంఘంలో సభ్యునిగా ఉండాలని ఎండీ గౌస్ అన్నారు. సోమవారం భీంపూర్ మండలంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ గౌస్ మాట్లాడుతూ సన్నహాక చర్యలకు అనుగుణంగా నిర్మాణరంగంలో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి భవనిర్మాణ కార్మిక సంఘం కృషి చేస్తుందని అన్నారు. కార్మికశాఖ ఆధ్వర్యంలో అమలు చేసే సంక్షేమ పథకాలు అందేవిధంగా కృషి చేస్తామని అన్నారు. కార్మికశాఖ అధికారుల ఆధ్వర్యంలో మండలంలో ప్రత్యేకంగా క్యాంపు ఏర్పాటు చేసి కార్మికులకు లేబర్ కార్డులు అందేవిధంగా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగనాథ్, పాండురంగ్, శ్యాంరావ్, బలిరాం పాల్గొన్నారు.

ఎంపీ గోడం నగేష్‌ను సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-బోథ్

ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌ను సోమవారం బోథ్ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఎంపీ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ జిల్లాకు ఎంపీగా ఎన్నికైన సందర్భంగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కూడాల స్వామి, నాయకులు మన్నెపాగా అశోక్, కారం రవి, మల్లెపు గోపి, ప్రసాద్, గజ్జల శంకర్ పాల్గొన్నారు.

నేడు స్విమ్మింగ్ పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో ఉన్న ఈత కొలనులో ఈ నెల 9న ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి ఈత ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఈత సంఘం కార్యదర్శి మహేందర్ జిత్, స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్-1 విభాగంలో 15, 16, 17, గ్రూప్-2 విభాగంలో 12, 13, 14, గ్రూప్-3 విభాగంలో 10, 11 ఏండ్ల బాల బాలికలకు ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బటర్ ఫ్లై, ఇండివిజువల్ మెడ్లే క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఎంపికైన బాల, బాలికలు ఈనెల 13, 14 తేదీల్లో సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ ఇండోర్ స్టేడియంలోని ఈత కొలనులో నిర్వహించే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రజలకు చేసిన సేవలే గుర్తుండిపోతాయి

నవతెలంగాణ-జన్నారం

ప్రజలకు చేసిన సేవలు చిరస్థాయిగా గుర్తుండిపోతాయని నేతకాని సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్ అన్నారు. సోమవారం జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ పదవీ విరమణ పొందిన సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి జడ్పీటీసీ చంద్రశేఖర్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో నేతకాని సంక్షేమ సమితి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జాడ్ వెంకటయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీల రిలే నిరహార దీక్షలు ప్రారంభం

- జీఓ నెం.10 రద్దు చేయాలని డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీలను రిటైర్‌మెంట్ బెన్ఫిట్ లేకుండా ఇంటికి పంపించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నెం.10 రద్దు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, రాష్ట్ర అధ్యక్షురాలు సునీత దీక్షదారులకు మాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునిత మాట్లాడుతూ పాత జీఓ నెం.10 ప్రకారం అతి తక్కువ డబ్బులు చెల్లించి జులై 24 తర్వాత ఇంటికి పంపిస్తామని నిర్ణయం చేయడం అంటే రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను మోసం చేయడం తప్ప మరొకటి లేదని మండిపడ్డారు. నష్టం కలిగించే జీఓ నెం.10ని రద్దు చేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కు రూ.2లక్షలు, హెల్పర్స్‌కు రూ.1లక్ష పెంచుతూ కొత్త జీఓను జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, రత్నమాల, సునిత, శన్విక పాల్గొన్నారు.

ఘనంగా వైయస్సార్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మాజీ సీఎం వైయస్సార్ జయంతి వేడుకలను సోమవారం కేఆర్‌కే కాలనిలోని వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ ముఖ్యమంత్రిగా ఆరోగ్య శ్రీ, 104, 108 సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్, జలయజ్ఞం లాంటి ఎన్నో పథకాలను తీసుకువచ్చారని గుర్తుచేశారు. ప్రతీ పేదవాడి గుండెచప్పుడుగా ఆయన ఎప్పటికీ ప్రజలగుండెల్లో నిలిచిపోతారని అన్నారు. ఆయన జీవితం ప్రతీ ఒక కాంగ్రెస్ కార్యకర్తకు ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో మావల మండలాధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు దామోదర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, రంజిత్‌రెడ్డి, కుర్ర నరేష్, ఆదిత్య, వృద్ధులు పాల్గొన్నారు.

ముథోల్ : మండల కేంద్రంలోని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ 75వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వైయస్సార్ జయంతి వేడుకలను పురస్కరించుకొని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ రావుల గంగారెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ ప్రవేశపెట్టి అమలు చేసిన పథకాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కిషన్ పటేల్, అజీజ్, దిగంబర్, వహాజ్, నగేష్, అనిస్ పాల్గొన్నారు.

బేల : మండల కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆ మహనీయుని సేవలను కొనియాడారు. ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు. ముందుగా రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ఫైజుల్లా ఖాన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భౌతికంగా ఈ రోజు మన మధ్య లేనప్పటికి ఆయన చేసిన సేవలు నేటికీ అందరి హృదయంలో చిరస్మరణీయంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మెన్ వామన్ వాంఖడే, కిసాన్ సెల్ మండలాధ్యక్షులు ఘనశ్యామ్, అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామ రూపేష్‌రెడ్డి, మినక సుధాంరెడ్డి, బొక్రె శంకర్, గోడే అవినాష్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఉట్నూర్ మండలాధ్యక్షులు అబ్దుల్ ఖయ్యుమ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్, డాక్టర్ జైవంత్, ప్యాక్స్ చైర్మెన్ ఎస్పీ రెడ్డి, మాజీ మండలాధ్యక్షులు దూట రాజేశ్వర్, బిరుదుల లాజర్, సలీం, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వైయస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రజా నాయకుడు తుది శ్వాస వరకు ప్రజా సంక్షేమం కోసం కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు ధోనికేని దయానంద్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ రాజుర సత్యం, పట్టణాధ్యక్షులు నిమ్మల రమేష్, మున్సిపల్ వైస్ చైర్మెన్ కావలి సంతోష్ మైనార్టీ సెల్ పట్టణాధ్యక్షులు సౌకత్ పాషా, నాయకులు లక్ష్మిపతి, ద్యవతి రాజేశ్వర్, శేషాద్రి, గోవింద్, రాజ్‌కుమార్, చరణ్, శివ, సంతోష్, మల్లయ్య యాదవ్, నిట్ట రవి పాల్గొన్నారు.

ముగిసిన ఎఫ్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ

- మొత్తం 715 మంది అభ్యర్థుల వెరిఫికేషన్ పూర్తి
- జులై 15 వరకు వెబ్ అప్షన్లకు అవకాశం
- జులై 19న సీట్ల కేటాయింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణలో ప్రభుత్వ, ప్రయివేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్‌లో ప్రవేశించేందుకు ఎఫ్‌సెట్ తొలి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజులపాటు ఈ ప్రక్రియ జరుగగా సోమవారంతో ముగిసింది. ఈ ప్రక్రియను కళాశాల ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ వీరస్వామి ప్రారంభించగా దగ్గరుండి పరిశీలించి అభ్యర్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. శని, ఆది, సోమ మూడు రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 9గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హెల్ప్‌లైన్ కేంద్రంలో సౌకర్యాలు కల్పించారు. మొదటి రోజు 283 మంది, రెండవ రోజు 231 మంది వెరిఫికేషన్ పూర్తయింది. చివరి రోజు 217 మంది అభ్యర్థులు స్లాట్ బుక్ చేసుకోగా 201 మంది అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను స్లాట్ బుక్ చేసుకున్న విధంగా హాజరై వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ వీరస్వామి మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగిన ప్రక్రియలో మొత్తం 715 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో ధ్రువపత్రాల పరిశీలన పూర్తయినట్లు తెలిపారు.

నచ్చిన కళాశాలలో వెబ్ అప్షన్లు ఇచ్చుకోవాలి

సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్న వారు జులై 15 వరకు వారికి నచ్చిన కళాశాలలు, కోర్సులను ఎంచుకునేందుకు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవాలి. వారికి జులై 19న తొలివిడత సీట్ల కేటాయింపు పూర్తి చేయనున్నారు. ఇక జులై 26 నుంచి రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. జులై 27 సర్టిఫికెట్ వెరిఫికేషన్, జులై 27 నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇవ్వనున్నారు. జులై 31న రెండో విడత సీట్ల కేటాయింపు పూర్తి చేస్తారు. ఆగస్టు 8 నుంచి మూడో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించి ఆగస్టు 9న సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయనున్నారు. అదే రోజు నుంచి ఆగస్టు 10 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చి ఆగస్టు 13న ఆఖరి ఫేజ్ సీట్ల కేటాయింపు పూర్తి చేయనున్నారు. కన్వీనర్ కోటా ఇంటర్నల్ స్లైడింగ్‌కు ఆగస్టు 21, 22 తేదీల్లో అవకాశం కల్పించి ఆగస్టు 26న సీట్ల కేటాయింపు పూర్తి చేయనున్నారు.

పశుమిత్ర, ఐకేపీ వీఓఏ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్

పశుమిత్ర, ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రజావాణిలో డీఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా పశు మిత్రులుగా పని చేస్తున్నామన్నారు. కానీ ప్రభుత్వం మాత్రం ఎలాంటి వేతనం నిర్ణయించలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి కనీస వేతనం నిర్ణయించాలని, ఐడి కార్డులు, యూనిఫామ్‌లు ,హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఐకెపి వివోఏలుగా గ్రామీణ ప్రాంత మహిళల అభివృద్ధి కొరకు నిరంతరం పాటు పడుతున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామని తెలిపారు. అయినా ప్రభుత్వాలు గుర్తించలేడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరించడానికి హామీ ఇచ్చిందని, హామీ మేరకు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకెపి వివోఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లింగంపల్లి వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట పోషం, జిల్లా కోశాధికారి సమ్మయ్య, పశు మిత్ర, ఐకెపి వివోఏ సంఘాల నాయకులు సరోజ, మంగ, భాగ్యలక్ష్మి, రమ, కుంటల కుమార్, దుర్గం రాము పాల్గొన్నారు.

సఖీ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

సఖీ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం భుక్తాపూర్‌లోని గర్ల్స్ హైస్కూలు, కొలాం హాస్టల్, హౌసింగ్ బోర్డ్ కాలనీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సఖీ కేంద్రం లీగల్ కౌన్సిలర్ సంఘమిత్ర, కేస్ వర్కర్ ప్రవీణ మాట్లాడుతు సఖీ కేంద్రం అందించే కౌన్సెలింగ్, న్యాయ, పోలీస్ సాయం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి గురించి తెలియజేశారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సఖి కేంద్రానికి వచ్చే బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అత్యవసర సమయాల్లో హెల్ప్ లైన్ నెంబర్లు 181, 100, 1098, 1930కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, ఉపాధ్యాయురాలు సులోచన, పారా మెడికల్ అధికారిణి సుకేష్ణ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వినతి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ఆదివాసీ గూడేల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్‌కు వినతిపత్రం అందించారు. మండలంలోని ఆదివాసీ గూడాల్లో వర్షాకాలంలో అంటువ్యాధులు, మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు రాకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, వ్యాధులను నివారించాలని కోరారు. గట్రావ్‌పల్లిలోని సబ్‌సెంటర్ పనులు త్వరగా పూర్తిచేసి ఈ ప్రాంత ఆదివాసులకు వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ గౌరవాధ్యక్షుడు ఆత్రం జంగు, మడావి శంకర్, కోవ లింగు, కోట్నాక భీంరావ్, రెడ్డి బాల్‌రాజ్ పాల్గొన్నారు.

సికాస మావోయిస్టు నేత అరెస్ట్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పట్టణంలోని స్థానిక ఆర్ కె1 రోడ్డు సమీపంలో సోమవారం సికాస మావోయిస్టు పార్టీకి చెందిన మావోయిస్టు మహమ్మద్ హుస్సేన్(73)ను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు నెలల నుంచి మావోయిస్టు భావాజాలన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో సికాస పునర్నిర్మాణం కొరకు మావోయిస్టు పార్టీ సానుభూతిపరులు కోల్ బెల్ట్ ఏరియాలో కరపత్రాలు విడుదల చేస్తున్నారు. కొందరు వ్యక్తులు సికాస పునర్నిర్మాణం కోసం తిరుగుతున్నారని సమాచారం మేరకు రామకృష్ణాపూర్, మందమర్రి ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఆర్ కె1 మైన్ రోడ్డు ప్రాంతంలో ఒక వ్యక్తి నల్లటి బ్యాగు భుజానికి వేసుకొని కనిపించగా అతనిని చూసి ఆపడానికి ప్రయత్నం చేయగా అక్కడినుంచి పారిపోవడానికి ప్రయత్నం చేశాడు. పట్టుకొని తన వద్ద బ్యాగును చెక్ చేయగా ఆ బ్యాగులో మావోయిస్టుపార్టీ డాక్యుమెంట్స్, మావోయిస్టు వాల్ పోస్టర్స్, కరపత్రాలు గుర్తించారు. అతన్ని అరెస్టు చేసి విచారించగా తన పేరు మహ్మద్ హుస్సేన్, సుధాకర్, ఎ. రమాకాంత్ మావోయిస్టునని, తాను జమ్మికుంట నివాసుడనని తెలిపాడు. అతని బ్యాగులో ఉన్న మావోయిస్టు పార్టీ డాక్యుమెంట్స్, మావోయిస్టు వాల్ పోస్టర్స్, కరపత్రాలు, సెల్ ఫోన్ సీజ్ చేశారు. ఆయన అరెస్టును తెలంగాణ రాష్ట్ర పౌర హక్కుల సంఘం సహాయ కార్యదర్శి మాధన కుమార స్వామి ఖండించారు.



కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తా

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్

నవతెలంగాణ-భైంసా

కేంద్ర ప్రభుత్వ నిధులతో ముథోల్ నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడుతానని ఎంపీ గోడం నగేష్ అన్నారు. సోమవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బీజేపీ ఆధ్వర్యంలో ఓటరు మహాశయులకు కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో జాతీయ రహదారులు, రైల్వేలైన్, ఉపాధి హామీలోల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు వెల్లడించారు. నిర్మల్ జిల్లాలోని ముథోల్, నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో బీజేపీకి అత్యధిక మెజార్టీ రావడం జరిగిందని, కార్యకర్తలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. మండుటెండల్లో సైతం పని చేసిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో మెజార్టీ కట్టబెట్టి తన ప్రతిష్టను మరింత పెంచేలా చేసిన కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా పార్లమెంటరీ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, మాజీ మున్సిపల్ చైర్మెన్ బీ.గంగాధర్, నాయకులు బోయిడి విఠల్, మాజీ ఎంపీపీ రజాక్, సోలాంకీ భీంరావు, సొంఫ్లీ రమేష్, పట్టణ అధ్యక్షులు మల్లేష్, కౌన్సిలర్లు తోట విజయ్, గాలి రవికుమార్, దిలీప్, మహిళా మోర్చా మండల అధ్యక్షులు సుష్మారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా పరిపాలనలో వైఎస్ఆర్ గొప్పనేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజల వద్దకు పాలన తీసుకురావడంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎంతో కృషి చేశారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ శ్యాం నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో వైఎస్ఆర్ 75వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ ఎంతో గొప్ప నేత అని కొనియాడారు. 108, ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్‌సమెంట్ లాంటి పథకాలు తెచ్చి పేదలకు అండగా నిలిచాడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు జక్కన్న, నిజాం, మంగ, బాలేష్, రజాక్ పాల్గొన్నారు.

నేడు జైనూర్‌లో తేనెటీగల పెంపకంపై శిక్షణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని జైనూర్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉషేగావ్ రైతు వేదికలో తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు శిక్షణా కార్యక్రమం ఉంటుందని, ఆసక్తి కలిగిన రైతులు, యువతీ యువకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

వెల్గనూర్ ప్రభుత్వ పాఠశాలలో వనమహోత్సం

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని వెల్గనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం వనమహోత్సవం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పలు రకాల మొక్కలను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ చెట్లతోనే పర్యావరణం పరిరక్షించగలుగుతామని తెలిపారు. భావితరాల భవిష్యత్తుకు చెట్లు ఎంతో మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెటర్నరీ ఛాంపియన్లను సన్మానించిన ఏఎస్పీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జూన్ 5 నుంచి 7 వరకు ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్యలో జరిగిన 5 కేఎం వాకింగ్ ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 2024 ఈవెంట్‌లో ఛాంపియన్లుగా నిలిచిన వారిని ఏఎస్పీ ప్రభాకర్ రావు సత్కరించారు. జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం బుర్గూడ గ్రామానికి చెందిన వైరగాడే శకుంతల టోర్నమెంట్‌లో ద్వితీయ బహుమతి పొందగా, వైరగాడే ఆనంద్ రావు 5వ ర్యాంక్ పొందారు. వీరిని జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి ఈ ఘనత సాధించిన వీరు ఈ వయసులో కూడా చాంపియన్లుగా నిలవడం చాలా గొప్ప విషయమన్నారు. అలాగే పోలీస్ శాఖ తరపున ఎలాంటి ఆర్థిక సాయం కావాలన్నా చేయడానికి ముందుంటానని భరోసా ఇచ్చారు.

12 నుండి సదరం శిబిరాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఈ నెల 12 నుండి నిర్వహించనున్న సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ప్రాథమిక ఆరోగ్య సేవ కేంద్రాలలో దివ్యాంగత్వ పరీక్ష చేయించుకుని స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత నిర్ణీత తేదీలలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే సదరం శిబిరాలకు సకాలంలో హాజరు కావాలని, ఈ నెల 12న మూగ, చెవిటి, 15న మానసిక వైకల్యం, 22న కంటిచూపు, 27, 30లో ఎముకలు సంబంధిత సమస్యలున్నవారు సదరం శిబిరానికి హాజరు కావాలని పేర్కొన్నారు.